
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

శనివారం 25 అక్టోబరు 2025

భౌబోయ్..

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారం
- స్కూలుకు వెళ్లేందుకు జంకుతున్న విద్యార్థులు
- రెండు నెలల్లో 3 పీహెచ్‌సీల పరిధిలోని దాదాపు 60మందికి పైగా కుక్కకాటు..

8



బెజుగామ తుర్కనికుంటలోకి ఈదుకుంటూ వెళ్లి మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ప్రాణాలకు తెగించిన విద్యుత్ సిబ్బంది!

- బెజుగామ తుర్కనికుంటలో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు
- విద్యుత్ పునరుద్ధరణతో మూడు గ్రామాలకు ఉపశమనం



గజ్వేల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించడమే తమ విధిగా భావించి, కష్టసమయంలో ప్రాణాలకు తెగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు గజ్వేల్ విద్యుత్‌శాఖ సిబ్బంది. ఈ సాహసోపేత ఘటన గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో చోటుచేసుకుంది.

బెజుగామ 11కేవీ ఫీడర్ నుంచి బెజుగామ, చిన్న ఆరేపల్లి, హాసన్‌మీరాపల్లి గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్‌లోని డిస్క్ ఒకటి పాడైపోయింది. దీంతో మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు చేపట్టడానికి ఆ ప్రాంతానికి వెళ్లిన లైన్‌మన్ ప్రవీణ్, జూనియర్ లైన్‌మన్ సత్యనారాయణ, గ్రామ సహాయకుడు రాజయ్యకు అక్కడే ఓ సవాలు ఎదురైంది. ఆ డిస్క్ మరమ్మతు చేయాల్సిన స్తంభం గ్రామంలోని తుర్కనికుంట మధ్యలో ఉంది. సమయం వృథా చేయకుండా, ప్రాణాలకు తెగించి ఆ ముగ్గురు సిబ్బంది కుంటలో ఈదుకుంటూ వెళ్లి ఆ స్తంభాన్ని చేరుకున్నారు. అక్కడికక్కడే పాడైన డిస్క్‌ను మార్చి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ గజ్వేల్ డీఈ ఆర్.భానుప్రకాశ్, ఏడీ జగదీశ్‌ఆర్య, ఏఈ మారుతి వారిని ప్రత్యేకంగా అభినందించారు.

- మెదక్ జిల్లాలో తల్లీకుమార్తె దుర్మరణం
- మస్కట్ నుంచి వచ్చిన తల్లి
- కుమార్తెకు బెంగళూరులో ఉద్యోగం
- ముందు రోజే వెళ్లాల్సి ఉండగా వాయిదా
- పటాన్‌చెరులో కుమార్తె వద్దకు వచ్చి..
- తల్లీకుమారుడు మృతి



శివాయిపల్లిలో కన్నీళ్లు పెడుతున్న సంధ్యారాణి బంధువులు, గ్రామస్తులు

అయ్యో.. ఎంత పనాయే..!

కన్నీరు మిగిల్చిన బెంగళూరు ప్రయాణం

మెదక్/ మెదక్ కల్చరల్/పాపన్నపేట/ పటాన్ చెరు. అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లికి చెందిన ఆనంద్‌గౌడ్‌కు పాపన్నపేటకు చెందిన సంధ్యారాణితో 23 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆనంద్‌గౌడ్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా, కంపెనీ తరఫున మస్కట్‌కు పంపించడంతో భార్యతో కలిసి అక్కడే ఉంటున్నాడు. వీరి కుమార్తె చందన వరంగల్ ఎన్ఐటీలో చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కుమారుడు వల్లభ్‌గౌడ్ ప్రయాగ ఎన్ఐటీలో చదువుతున్నాడు. ఈక్రమంలో పాపన్నపేటలో తన తండ్రి సంవత్సరీకానికి గత నెలలో సుధారాణి వచ్చారు. అక్కడి నుంచి కుమార్తె వద్దకు వెళ్లారు. దసరా సందర్భంగా వారం రోజుల సెలవుల నిమిత్తం వల్లభ్‌గౌడ్ కూడా బెంగళూరు వచ్చి వెళ్లారు. ఇటీవల తల్లీ ఇద్దరు పిల్లలు మెదక్‌లో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చారు. సంధ్యారాణి భర్త దగ్గరకు వెళ్లేందుకు 15 రోజుల క్రితం టికెట్లు బుక్ చేసుకున్నా.. జ్వరం రావడంతో ఆగిపోయారు. తర్వాత కుమార్తెను బెంగళూరులో దింపి అటు నుంచి అటే మస్కట్ వెళ్లేందుకు నవంబర్ 6 టికెట్ బుక్ చేసుకున్నారు. ఈమేరకు బుధవారం వెళ్లాలని భావించినా ప్రయాణం వాయిదా పడింది. గురువారం రాత్రి బస్సు ఎక్కగా, ప్రమాదం జరిగింది. వచ్చే నెల 9న సంధ్యారాణి, ఆనంద్‌గౌడ్‌ల వివాహ వార్షికోత్సవం జరగాల్సి ఉంది.

మిన్నంటిన రోదనలు..

సంధ్యారాణి, ఆమె కుమార్తె చందన బస్సు ప్రమాదంలో మృత్యువాత పడ్డారనే విషయం తెలియగానే ఆమె పుట్టినిల్లయిన పాపన్నపేట, మెట్టినిల్లయిన శివాయిపల్లి ఒక్కసారిగా గొల్లుమన్నాయి. ఇటీవల తమ ఇళ్లకు వచ్చి ఆప్యాయంగా అందరినీ పలకరించి, అందరితో కలిసి ఆనందంగా గడిపిన వారు బస్సు ప్రమాదంలో కాలిపోయారని తెలిసి బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ తండ్రి సంవత్సరీకానికి సంధ్యారాణి వచ్చి వెళ్లిందని ఆమె సోదరులు పాపన్నపేట మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, రవీందర్ గౌడ్ రోదిస్తూ చెప్పారు. ఈ ఆనంద క్షణాలు మరువక ముందే వారు ఇక లేరన్న విషయం తెలిసి గ్రామంలో విషాదం నెలకొంది. ఇక శివాయిపల్లిలోనూ బంధువులంతా రోదిస్తున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టిస్తోంది. ప్రేమతో అప్పుడప్పుడు వచ్చి ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు సైతం కన్నీరు పెట్టారు. సంధ్యారాణి సోదరుడు

మిగతా 7వ పేజీలో

బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు కర్నూల్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో విషాదాన్ని నింపింది. తండ్రి సంవత్సరీకం కోసం మస్కట్ నుంచి వచ్చిన సుంధ్యాణి(42), కుమార్తె చందన(23)తో కలిసి బెంగళూరు వెళ్లే ట్రావెల్స్ బస్సు ఎక్కి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. మొన్ననే అందరినీ ఆప్యాయంగా పలకరించింది.. ఇంతలో ఎంత పనాయే.. ప్రయాణాలు వాయిదా పడకుంటే బతికి పోయేవారు.. అని వారి బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఇక పటాన్‌చెరులోని కుమార్తె వద్దకు తల్లి ఫిలోమినా బేబీ (68), కుమారుడు కిశోర్‌కుమార్ (41)తో కలిసి దీపావళి పండుగ కోసం వచ్చి తిరిగి వెళ్తూ బస్సు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.

ప్రైవేట్ ట్రాహెల్

7

ఈ గ్రామం నుండే భారతదేశంలో ప్రతిష్ఠాత్మకమైన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు పొందిన అందే డప్పు భాస్కర్ నా స్వగ్రామం ఇది నా గ్రామ పరిస్థితి



సోషల్‌మీడియాలో పోస్టు చేసి గ్రామ యువత

రోడ్లు వేయండి.. ఓటు అడగండి

- అప్పటి వరకు పార్టీల జెండాలు మోయం
- సోషల్ మీడియా వేదికగా యువత సమరం
- పార్టీలకతీతంగా ఏకమైన అందె గ్రామం

దుబ్బాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): "మా గ్రామానికి రహదారి వేయండి... ఓటు అడగండి.. అప్పటి వరకు ఏ పార్టీ జెండాలు మోయం!" అంటూ దుబ్బాక నియోజకవర్గం యువత సోషల్ మీడియా వేదికగా వినూత్న ఉద్యమానికి తెర లేపింది. మిరుదొడ్డి మండలం అందె గ్రామ యువత తమ గ్రామానికి దశాబ్దాలుగా రహదారి లేకపోవడంతో పడుతున్న అవస్థలను ప్రశ్నిస్తూ సమరశంఖం పూరించింది. రాజకీయాలకు అతీతంగా ఏకమైన యువత... పాలకులను నిలదీస్తూ పోస్టుకార్డు ఉద్యమానికి కూడా సిద్ధమవుతోంది. బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి రోడ్లు వేయాలని వినతిపత్రం ఇచ్చారు.

గర్భిణులకు ప్రసవ యాతన!

"మా గ్రామానికి మండల కేంద్రం నుంచి 4 కిలోమీటర్లు, మెదక్-సిద్దిపేట రహదారి నుంచి 8 కిలోమీటర్లు, దౌల్తాబాద్-సిద్దిపేట రహదారి నుంచి 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ మూడు రహదారులు రెండు దశాబ్దాలుగా గుంతలమయంగా మారాయి.." అంటూ ఆ గ్రామస్తులు సోషల్ మీడియా ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంబులెన్స్ సకాలంలో గ్రామానికి రాకపోవడం, రోగులను ఆసుపత్రికి చేర్చడం కష్టంగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదని, గర్భిణులు మార్గం మధ్యలోనే ప్రసవించిన సంఘటనలు కూడా ఉన్నాయని వెల్లడించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తమ గ్రామం మీదుగా పెద్దవాహనాలు మట్టిని తరలించడం వల్లే రహదారులు చెడిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ సమస్య పరిష్కారమయ్యే వరకు పార్టీల జెండాలు మోయబోమనీ, పార్టీలకతీతంగా ఉద్యమిస్తామని యువత స్పష్టం చేసింది.

విజ్ఞాన వినియోగంతో వ్యవసాయాభివృద్ధి

- నూతన పరిశోధనలకు ఆదర్శం కావాలి : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- వర్గల్‌లో కావేరి ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం



కావేరీ యూనివర్సిటీ భవన నమూనాను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గజ్వేల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ ఉత్పత్తి, సాంకేతికత, పరిశోధనలను అభివృద్ధి చేయడంతో పాటు సమాజ మార్పుకు దిక్సూచిలా నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం శివారులోని కావేరి యూనివర్సిటీ, కావేరి విత్తన పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కావేరి ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్‌ను గవర్నర్ ప్రారంభించారు. ముందుగా కావేరి యూనివర్సిటీకి వచ్చిన గవర్నర్‌కు యూనివర్సిటీ, సీడ్స్ పరిశ్రమ చైర్మన్ భాస్కర్‌రావు, సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్, కలెక్టర్



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న గవర్నర్

హైమావతి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆయన వందనం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, వాటి పరిశోధనా ఫలాలను రైతులకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పరిశోధన చేసే విద్యార్థులు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను పొంది, మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. నూతన సాంకేతికతతో అద్భుత వంగడాలు, ఆహార సంపద సృష్టించి దేశ పునర్నిర్మాణంలో కావేరి విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. యువ శాస్త్రవేత్తలకు అద్భుతాలు సృష్టించే సత్తా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లాలని చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి అగ్రిటెక్ యూనివర్సిటీ కాగా, ఆధునిక సాంకేతికతను జోడించి పరిశోధన విద్యార్థులు క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలు అందించాలన్నారు. విద్యార్థులు విజ్ఞానాన్ని వినియోగించి ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యతనిస్తూ, విభిన్న రంగాలకు ప్రాధాన్యం ఇచ్చే విజన్‌తో ముందుకు సాగుతున్న కావేరి విత్తన పరిశోధన కేంద్రం చక్కటి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం దైనందిన జీవితంలో డ్రోన్ టెక్నాలజీ ముఖ్య భూమిక పోషిస్తోందని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీతో నిరంతర ఆవిష్కరణలు జరగాలన్నారు. పర్యావరణానికి

మిగతా 8వ పేజీలో

ఉపాధిహామీలో అక్రమాలకు చెక్

- ఈ-కేవైసీతో పనుల్లో పారదర్శకత
- జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం
- ఈ-కేవైసీ త్వరగా పూర్తికి చర్యలు

దౌల్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసి.. పనుల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ-ఎంబీ (ఎలక్ట్రానిక్ మేజర్‌మెంట్ బుక్), ఈ-కేవైసీ విధానాల్లో పని ప్రదేశంలో వివరాల నమోదు, కూలీల హాజరు ప్రక్రియలో నూతన సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ నెల 1 నుంచి ఈ-ఎంబీ, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

తప్పులకు అవకాశం లేకుండా..

గ్రామాల్లో చేపట్టనున్న పనుల వివరాల నమోదు కోసం ఈ-ఎంబీ (ఎలక్ట్రానిక్ మేజర్‌మెంట్ బుక్) విధానాన్ని అమలులోకి తెచ్చారు. పనిచేసే ప్రాంతాల వివరాలను ముందుగా కొలత పుస్తకంలో, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఈ-ఎంబీలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌తో అనుసంధానించడం ద్వారా పనులను ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉంటుంది. దీంతో ఒకేచోట రెండు పనులు చేయడం వంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు.

ఈ-కేవైసీతో నకిలీలకు తెర..

గతంలో పని ప్రదేశం వద్ద కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ (ఎన్ఎంఎంఎస్)లో అప్‌లోడ్ చేసేవారు. అయితే కొందరు క్షేత్ర సహాయకులు, మేట్లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకువచ్చినా, దానిని కూడా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది. దీంతో నకిలీ హాజరును పూర్తిగా అరికట్టేందుకు ఈ-కేవైసీ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో దౌల్తాబాద్ మండలంలో కూలీల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. సిగ్నల్స్ అంతరాయం కారణంగా ఈ-కేవైసీ నమోదులో సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సమయాల్లో యాప్ పనిచేయకపోవడంతో ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఈ ప్రక్రియ పూర్తవగానే అమలులోకి తీసుకువస్తారు. దీని ప్రకారం, పని ప్రారంభంలో ఒకసారి

మిగతా 8వ పేజీలో



ప్లే స్కూల్ సామగ్రికి టెండర్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 51 ప్లేస్కూళ్లలో కావాల్సిన సామగ్రి టెండర్ ప్రక్రియ కలెక్టర్ కె.హైమావతి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్లేస్కూళ్లలో కావాల్సిన ఆట వస్తువులు, కుర్చీలు, టేబుల్స్ ఇతరత్ర వస్తువులను ప్రదర్శించి ఎనిమిది కంపెనీలు టెండర్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం ప్లే స్కూళ్లలో మంచి సౌకర్యాలు కల్పించాలని, పిల్లలకు ఇబ్బంది లేకుండా సృజనాత్మక ఆలోచనలు వెలువడేలా ఆట వస్తువులను తయారు చేస్తే ఆడుకోవడానికి వీలుంటుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్ధేశించిన రేటుకు టెండర్ ఫైనల్ చేసి తయారీ చేసే బాధ్యతలను ఎనిమిది కంపెనీలకు అప్పగించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీడబ్ల్యూవో శారద, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ భవ్య పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, పర్కోస్ గ్రూప్ సీఈవో ప్రమీల్ అర్జున్

సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉన్నవారే

హ్యాకర్ల టార్గెట్

- సైబర్ సెక్యూరిటీ నిపుణులు, వక్తలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉన్న యువత, విద్యావంతులైన వ్యక్తులనే హ్యాకర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, పర్కోస్ గ్రూప్ సీవో ప్రమీల్ అర్జున్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి, రాష్ట్రీయ ఉచ్చతర శిక్షా అభియాన్ (ఆర్‌యుఎస్‌ఏ) సహకారంతో "సైబర్ భద్రత, సవాళ్లు, దృక్పథాలు" అనే అంశంపై సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగనుంది. మొదటిరోజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత అధ్యక్షతన కార్యక్రమం మొదలైంది. ఈ సదస్సును మొదటి రోజు ముఖ్య వక్తగా సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, పర్కోస్ గ్రూప్ సీవో ప్రమీల్ అర్జున్ హాజరై మాట్లాడారు. హ్యాకర్ల నుంచి రక్షణ కల్పించుకునే మార్గాలను సమగ్రంగా సదస్సులో వివరించారు. ప్రతి ఒక్కరూ పాస్‌వర్డ్‌లను క్రమం తప్పకుండా మార్చుకోవాలని సూచించారు. సైబర్ క్రైం ఏసీపీ శ్రీనివాసులు సెమినార్‌కు గౌరవ అతిథిగా హాజరై సెమినార్ నిర్వాహక కమిటీని అభినందించారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడారు. సైబర్ భద్రతపై సెమినార్ ఏర్పాటుచేసిన కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని అభినందించారు. సమావేశంలో సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగం శ్రీనివాసరెడ్డి, కన్వీనర్లు డా.మామిడాల శ్రీనివాస్, గురుచరణ్ దాసు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అయోధ్యరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ మధుసూదన్, పిట్ల దాసు, డాక్టర్ మహేష్ కుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



టెండర్ల ప్రక్రియ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

'కొండపోచమ్మ' టెండర్లకు

అనూహ్య స్పందన

- రికార్డు స్థాయిలో రూ. 88.90 లక్షల ఆదాయం
- గతేడాది కంటే రూ. 20 లక్షలు అదనం

జగదేవ్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా దేవాదాయ శాఖకు రికార్డు స్థాయిలో ఆదా యం సమకూరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఈవో రవికుమార్, చైర్మన్ అనుగీత ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాట ద్వారా ఆలయానికి మొత్తం రూ. 88.90లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతేడాది కంటే సుమారు రూ. 20లక్షల ఆదాయం ఎక్కువగా రావడం విశేషం. కొబ్బరికాయల టెండర్‌ను రూ. 23.10లక్షలకు, తిగుల్ నర్సాపూర్ గ్రామానికి చెందిన కిషన్, ఒడిబియ్యం టెండర్‌ను రూ. 25.70 లక్షలకు చాట్లపల్లి గ్రామానికి చెందిన మహేష్ సొంతం చేసుకున్నారు. కొబ్బరిముక్కల టెండర్‌ను రూ.7.90లక్షలకు బాబు వేచరేణి, లడ్డూ, పులిహోర టెండర్‌ను రూ. 30.20లక్షలకు తిగుల్ నర్సాపూర్‌కు చెందిన శ్రీకర్‌రెడ్డి దక్కించుకున్నారు. పూల టెండర్‌ను రూ.2లక్షలకు గురన్నపేటకు చెందిన నవీన్‌కుమార్ దక్కించుకున్నారు. దుకాణ సముదాయాల వేలంపాటను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, రమేష్, కనకయ్య, హరి, చిన్నా, సుధాకర్, చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



వర్షం కురవడంతో హుస్నాబాద్ పట్టణంలోని మార్కెట్‌యార్డులో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

ధాన్యంపై వరుణుడి పగ

అకాల వర్షాలు హుస్నాబాద్ డివిజన్‌లోని రైతన్నలను ఆగమాగం చేస్తున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట కళ్లముందే తడిసి, మొలకెత్తుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి మార్కెట్ యార్డులోని కేంద్రంలో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వర్ష సూచనతో అధికారులు రైతులకు కవర్లు అందించినప్పటికీ, వరద నీరు కింద నుంచి ప్రవహించడంతో ధాన్యం తడిసిపోయి, కొనుగోళ్లకు పనికి రాకుండా పోయింది. వర్షం భయానికి నిద్రకూడా పోవడం లేదని రైతులు వాపోతున్నారు.

హుస్నాబాద్/హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)



వర్షం భయానికి మహ్మదాపూర్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కుప్పలుగా పోసి కవర్లు కప్పిన రైతులు

అపజయాలకు వెరవవద్దు

- గుర్తింపు కోసం పాకులాడవద్దు.. మన శ్రమే మనకు గుర్తింపు తెస్తుంది
- చీనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మన జీవితం.. మన వ్యక్తిత్వం విశాలం కావాలంటే మన చుట్టూ ఉన్న హద్దులను చెరిపేసుకోవాలని, అదే సమయంలో మన పరిమితులేమిటో కూడా గుర్తెరగాలని ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తైన చీనాబ్ వంతెన నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించిన బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ జి. మాధవీలత పిలుపునిచ్చారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపజయాలకు ఎవరూ వెరవవద్దన్నారు. అపజయం వెంట విజయం ఎప్పుడూ ఉంటుందని, మనం చేయాల్సిందల్లా దాని వెంట పరుగు తీయడమేనన్నారు. జీవితంలో ఉన్నతంగా రాణించాలని అందరూ అనుకుంటారని, కానీ తమ చుట్టూ ఉన్న అడ్డంకులను చూసి కుంగిపోతారని పేర్కొన్నారు. లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలంటే ముందు ఆ అడ్డంకులను ఛేదించుకొని తమను తాము విస్తరించుకోవాలని సూచించారు. గుర్తింపు కోసం వెంపర్లాడవద్దన్నారు. ఎవరూ మిమ్మల్ని గుర్తించకపోయినా చేయాల్సిన పని చేసుకుంటూపోతే గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందని తెలిపారు. ఇందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. వరంగల్ ఆర్ఈసీలో(ప్రస్తుతం నిట్) చదువుకున్న తాను.. గుర్తింపు కోసం ఏనాడూ పాకులాడలేదన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణం పూర్తయ్యాక అందులో తన పాత్రేమిటో తెలిసిన తర్వాత అందరూ తనను ప్రత్యేకంగా గుర్తించడం మొదలుపెట్టారని చెప్పారు. తాను ఎంటెక్ చదివిన వరంగల్ నిట్‌ను సైతం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ నిట్‌లో చదువుకున్నప్పటికీ పూర్వ విద్యార్థిగా ఇప్పటి వరకు పేరు నమోదు చేసుకోలేదని, చీనాబ్ వంతెన నిర్మాణం తర్వాత కళాశాల యాజమాన్యం పలుమార్లు అలమ్నీగా రిజిస్టర్ కావలసిందిగా కోరిందని తెలిపారు. వరంగల్ నిట్ ఒక అద్భుతమైన విద్యా కేంద్రంగా మాధవీలత అభివర్ణించారు. వరంగల్ నిట్ తనకు జీవితంతోపాటు జీవిత భాగస్వామిని కూడా ఇచ్చిందని ధన్యవాదాలు తెలిపారు. తన భర్త ఇదే కళాశాలలో ఎంటెక్(మెకానికల్) చేశారని, ప్రస్తుతం గూగుల్‌లో కీలక పదవిలో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.వెంకన్న, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి.రాధాక్రిష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మాధవీలత

అటవీ భూముల పరిష్కారానికి అధికారులుగా అదనపు కలెక్టర్లు

- అటవీ భూముల రక్షణలో కీలకం.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీ భూముల సమస్యల పరిష్కారానికి అధికారులుగా అదనపు కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అటవీ చట్టం-1967లోని సెక్షన్4(1)(సీ)ప్రకారం ఈ కొత్త నియామకాలు చేపట్టినట్లు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అటవీ భూముల సమస్యలకు సెటిల్మెంట్ అధికారులుగా ఇప్పటివరకు వ్యవహరించిన జాయింట్ కలెక్టర్ల పోస్టులు రద్దయిన నేపథ్యంలో, అదనపు కలెక్టర్లకు(రెవెన్యూ) ఆ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో అటవీసర్వే, సరిహద్దుల విషయంలో తీసుకునే నిర్ణయాలకు సంబంధించిన పనులను జాయింట్ కలెక్టర్లు నిర్వహించేవారు. అటవీ భూభాగాలకు సంబంధించిన అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలించడంతో పాటు, రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించే విధానంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చేసిన సిఫార్సుల మేరకు అటవీ భూముల సెటిల్మెంట్ పనులు తక్షణమే అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. సంబంధిత మార్పులతో కూడిన నోటిఫికేషన్‌ను ఈ నెల 31న విడుదల చేయనున్నారు. ఆ రోజునుంచే అదనపు కలెక్టర్ల నియామక ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సిందే

- బీసీల మహాధర్నాలో జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్
- ధర్నాలో పాల్గొన్న పలు బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించకపోతే కేంద్రంపై యుద్ధం ప్రకటిస్తామని పలువురు బీసీ సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలు హెచ్చరించారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా వారికి ప్రాతినిధ్యం లేదన్నారు. రాజకీయంగా బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో చట్టసభల్లో వారి ఉనికి నామమాత్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ధర్నాచౌక్ వద్ద '42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి' ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జస్టిస్ ఈశ్వరయ్య, పలువురు రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నేతలు హాజరై మద్ద తు ప్రకటించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం ద్వారానే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు ఇవ్వాలని, పార్టీ పరంగా కాదని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. "రిజర్వేషన్లు బీసీల హక్కు" అని అన్నారు. బీసీలను పాలక వర్గా లు బిచ్చగాళ్లుగా చూస్తున్నాయని ఎమ్మెల్సీ మధుసూదనాచారి మండిపడ్డారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని కేంద్రం బీసీలను మోసం చేస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన కోసం కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకుంటోందని మాజీ ఎంపీ హనుమంతరావు ఆరోపించారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీలంతా ఐక్యంగా పోరాటం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. నవంబరు 10 నుంచి 30వ తేదీ వరకు కామారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీసీ చైతన్య యాత్రలు చేపడుతున్నట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు వెల్లడించారు. ఈ ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు.

బీసీలంటే కేసీఆర్‌కు అంత చులకనా?

- బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలి: బీర్ల
- తెలంగాణకు, కేటీఆర్‌కు ఏంటి సంబంధం?: మందుల సామేలు
- హరీశ్.. బాకీ కార్డులపై బహిరంగ చర్చకు సిద్ధమా: బల్మూరి

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, బీసీ బిడ్డ అయిన నవీన్ యాదవ్‌ను రౌడీషీటర్ అంటూ కేసీఆర్ అవమానించాడు. బీసీలంటే ఆయనకు అంత చులకనగా కనిపిస్తున్నారా?' అంటూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి.. బీసీలను రౌడీలుగా చూపించే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్‌లకు తగిన బుద్ధి చెప్పాలని శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీలపై కేసీఆర్, కేటీఆర్‌లు పిచ్చి మాటలు మాట్లాడుతుంటే ఆ పార్టీలోని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ వంటి బీసీ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నవీన్ యాదవ్‌కు కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కుంభకర్ణుడు ఆరు నెలల పాటు తిని.. ఆరు నెలలు నిద్రపోయిన చందంగా కేసీఆర్ రాజకీయం ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యమే లేని కేటీఆర్‌కు, తెలంగాణకు ఏంటి సంబంధమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంటే బొందలగడ్డ పార్టీ అంటూ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబమే దండుపాళ్యం ముఠా అని.. నమ్ముకున్నవారిని నట్టేట ముంచిన చరిత్ర ఆ కుటుంబానిదని దుయ్యబట్టారు. బాకీ కార్డుల పేరుతో హడావుడి చేస్తున్న హరీశ్ రావు.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు బాకీ పడ్డ హామీలను గురించి మరిచిపోయారా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. బాకీ కార్డులు, బీఆర్ఎస్ పదేళ్ల పాలన.. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని హరీశ్.. ఇప్పుడు కపట ప్రేమ చూపుతున్నాడని మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉండి కూడా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయని బీఆర్ఎస్‌కు, హరీశ్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. వారు ఉద్యోగాలు ఇవ్వలేదు కాబట్టే రాష్ట్రంలోని నిరుద్యోగులు ఆ పార్టీని ఓడించారని ఓ ప్రకటనలో విమర్శించారు.

పిల్లలను వదిలి వెళ్లిందనే కసితో..

భార్యను హతమార్చిన భర్త

- గొడ్డలితో నరికి చంపిన వైనం
- ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో ఘటన


వర్ధని (ఫైల్)

ఏన్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తనను, ముగ్గురు పిల్లలను వదిలేసి వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోందన్న కోపంతో ఓ భర్త గొడ్డలితో భార్యను హతమార్చాడు. ఈ దారుణం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం కాలనీనాచారం గ్రామంలో శుక్రవారం జరిగింది. కాలనీనాచారానికి చెందిన తాటి రామారావుకు అదే గ్రామానికి చెందిన వర్ధని (32)తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. ఈ క్రమంలో వర్ధని అదే గ్రామానికి చెందిన అఖిల్ అనే వ్యక్తితో సన్నిహిత సంబంధం పెట్టుకుని, ఏడాది క్రితం భర్త, పిల్లలను వదిలి విజయవాడ వెళ్లి సహజీవనం సాగించింది. పెద్దమనుషులు, గ్రామస్థుల సమక్షంలో పంచాయితీ చేసి హెచ్చరించినా ఆమెలో మార్పు రాలేదు. మళ్లీ ఆరు నెలలుగా అఖిల్‌తో సత్తుపల్లి సమీపంలో సహజీవనం చేస్తోంది. ఈనెల 22న (బుధవారం) వర్ధని అఖిల్‌తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న భర్త రామారావు అక్కడికి వెళ్లి అఖిల్‌తో గొడవపడ్డాడు. అనంతరం అఖిల్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కుని, భార్య వర్ధనిని తీసుకుని స్వగ్రామమైన కాలనీనాచారం వచ్చా డు. పిల్లలు పెద్దవారవుతున్నారని,ఇక నుంచి కలిసి ఉందామని నచ్చజెప్పాడు. దానికి వర్ధని నిరాకరించింది. అప్పటికే రాత్రవడంతో అక్కడే ఉన్న ఆమె.. గురువారం కూడా భర్త ఇంట్లోనే ఉంది. భార్యపై కోపం పెంచుకున్న రామారావు శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న వర్ధనిని గొడ్డలితో నరికాడు. తల, ముఖంపై తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. వర్ధని తల్లి ముక్తి రాధమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు రామారావును అదుపులోకి తీసుకున్నారు.

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై

4 వారాల్లో నివేదికివ్వాలి

- సీఎస్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదంపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) ఆదేశించింది. గత ఫిబ్రవరి 22న టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో 8 మంది చిక్కుకుపోగా, మనోజ్‌కుమార్, గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహాలను వెలికి తీశారు. ప్రమాదం జరిగి 8 నెలలవుతున్నా గల్లంతైన మిగతా ఆరుగురు కార్మికుల సమాచారం కనుగొనలేదని ఎన్‌హెచ్ఆర్‌సీలో మానవ హక్కుల న్యాయవాది ఇమ్మనేని రామారావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారించి సమగ్ర నివేదికను సమర్పించాలని గత జూలై 31న నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శిని ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశించింది. అయితే, నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక సంతృప్తికరంగా లేదని పేర్కొన్న ఎన్‌హెచ్ఆర్‌సీ.. తక్షణమే దీనిపై విచారణ జరిపి, 4 వారాల్లో నివేదిక సమర్పించాలని ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

గన్స్ ఉపయోగించినవారిపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఓ సిమెంట్ కంపెనీ యాజమాన్యం వద్ద డబ్బుల వసూళ్ల వ్యవహారంలో గన్స్ ఉపయోగించినవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఎన్. నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు రోహిన్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఓఎస్‌డీ సుమంత్ గన్స్ ఉపయోగించిన వివాదంలో ఉన్నారని, ఈ మేరకు శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గన్ కల్చర్ తెచ్చి రాష్ట్రాన్ని మరో బిహార్‌లా తయారు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అక్రమాలు, అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రానికి అనేక రకాల పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త వాటిని తేకపోగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

12.65 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులు జప్తు

- ఒక్కడైరెక్టర్ పూర్ణచంద్రరావు 126 కోట్ల దారి మళ్లింపు

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాహితీ ఇన్‌ఫ్రా స్కామ్ కేసులో ఆ సంస్థ డైరెక్టర్ పూర్ణచంద్రరావుకు చెందిన రూ.12.65 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అటాచ్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో పూర్ణచంద్రరావును ఈడీ అరెస్టు చేసింది. ఇళ్ల ప్లాట్లు ఇస్తామని వేలాది మంది ఖాతాదారుల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసిన సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీపై గతంలో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ కంపెనీ తన ఖాతాదారులకు సుమారు రూ.845 కోట్ల బకాయి పడిందని నిర్ధారించారు. సంస్థ డైరెక్టర్‌గా పూర్ణచంద్రరావు ఒక్కరే సుమారు రూ.126 కోట్లు దారి మళ్లించి.. ఆ సొమ్ముతో 21 ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది.

బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 150 సీట్లు

రాజేంద్రనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది నుంచి బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 150 సీట్లు అందుబాటులోకి రానున్నాయని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మూడు నూతన వ్యవసాయ కళాశాలలను మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు, కొడంగల్‌కు వచ్చే కళాశాలలో 30 సీట్లు, నిజామాబాద్‌లో ఏర్పాటయ్యే కళాశాలలో 30 సీట్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఇది వరకే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ సీట్ల భర్తీకి త్వరలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆర్థిక సహకారంతో తెలంగాణ ఎప్‌సెట్-2025లో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 60 సీట్లను ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు జానయ్య తెలిపారు. ఈ సీట్లను రాజేంద్రనగర్, వరంగల్, జగిత్యాల, పాలెం, సిరిసిల్ల, అశ్వారావుపేట్ కళాశాలల్లో ఒక్కో కళాశాలలో 10 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నట్లు చెప్పారు. వీటిలో ప్రవేశాల కోసం ug.mjptbcwreis.net, pjtau.edu.in వెబ్‌సైట్లలో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

ఔటర్‌రింగ్ రోడ్డుపై కారు దగ్ధం

● సురక్షితంగా బయటపడిన ఏడుగురు కుటుంబసభ్యులు
● కారు ఆపి వివరాలు తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



కారులో ఎగిసిపడుతున్న మంటలు

పటాన్‌చెరు అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రయాణం చేస్తున్న కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగగా, గమనించి కారు లోంచి కిందికి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. మరుక్షణం పెద్దఎత్తున మంటలు వ్యాపించి కారు మొత్తం దగ్ధమైన సంఘటన పటాన్‌చెరు ముత్తంగి ఔటర్‌రింగ్ రోడ్డుపై శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేటకు చెందిన సంతోష్ శుక్రవారం ఉదయం సమయంలో ఏడుగురు కుటుంబసభ్యులతో శంకరపల్లిలోని సమీప బంధువుల గృహప్రవేశానికి ఔటర్‌రింగ్ రోడ్డుపై కారులో వెళుతున్నారు. మార్గంమధ్యలో పటాన్‌చెరు ముత్తంగి ఔటర్ దాటగానే కారులో మంటలు పుట్టాయి. గమనించిన కుటుంబసభ్యులు కారు ఆపి వేగవంతంగా కిందకు దిగారు. కిందికి దిగిన మరుక్షణం ఒక్కసారిగా మంటలు పెరిగి కారు మొత్తం తగలబడుతుండగా అదేసమయంలో ఐలాపూర్ మాణిక్‌యాదవ్ అటుగా వెళుతుండగా కారు ఆపి పటాన్‌చెరు అగ్నిమాపకశాఖ అధికారులకు సమచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి కుమారుడు వివాహానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కారు ఆపి తగలబడుతున్న కారును చూసారు. కిందికి దిగి రోడ్డు పక్కనే నిలబడిన సిద్దిపేటకు చెందిన కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఆటోను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

● బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఘటన.. ఇద్దరికి స్వల్ప గాయాలు

జోగిపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదం జరిగిన ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధితుల కథనం మేరకు.. అందోల్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన మల్లేషం, స్వాతి దంపతులకు నాలుగు రోజుల క్రితం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించాడు. పుట్టిన శిశువు బరువు తక్కువగా ఉండడంతో (వేట్ లాస్) హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి ఇక్కడి వైద్యులు తరలించారు. ఆసుపత్రి నుంచి తమ గ్రామానికి తిరిగి వస్తుండగా అందోల్ గురుకుల పాఠశాల వద్ద డివైడర్ మధ్యలో నుంచి ఆటో అటు వైపుకు వెళ్తుండగా నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సంగారెడ్డి నుంచి వేగంగా వచ్చి అదుపుతప్పి ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సువర్ణ, పోచ్చమ్మలకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన ఆటో పాక్షికంగా దెబ్బతింది. బాలింత, పుట్టిన శిశువు క్షేమంగా ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు గాయపడిన క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పటాన్‌చెరు అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై అక్బర్‌ఖాన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిజిల్లా పిట్లం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శివ(30) తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామంలో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురయ్యాడు. గురువారం రాత్రి సమయంలో అత్తగారింటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారి సహకారంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు భార్య శివలీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సు దిగుతూ గుండెపోటుతో మహిళ మృతి



బాలమణి మృతదేహం

కౌడిపల్లి, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 24 : ఆర్టీసీ బస్సు దిగుతూ మహిళ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లిలో శుక్రవారం జరిగింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన బాలమణికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేటలో ఉన్న రెండో కుమార్తె సుశీల ఇంటికి గురువారం వెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం కుమార్తె సుశీలతో కలిసి బాలమణి కౌడిపల్లి మండలంలోని కంచన్‌పల్లికి చెందిన తమ బంధువుల ఇంటికి ఆర్టీసీ బస్సులో కొల్చారం మండలంలోని పోతన్‌శెట్టిపల్లి నుంచి బయలు దేరారు. ఇదే క్రమంలో కౌడిపల్లి బస్టాండ్‌లో బస్సు దిగే క్రమంలో మెట్లు దిగుతుండగా బాలమణి ఒక్కసారిగా కింద పడిపోయింది. దీంతో వెంటనే బస్సులో ఉన్న మహిళా కండక్టర్ స్వరూప మూర్ఛ అనే ఆలోచనతో తన వద్ద ఉన్న బస్ టికెట్ స్టాప్లర్‌ను చేతిలో పెట్టారు. తర్వాత సీపీఆర్ చేశారు. అయినప్పటికీ ఎలాంటి చలనం లేకపోవడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి మృతిచెందిదని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కంది మండలం ఎర్దనూరు గ్రామ శివారులోని పీఎస్ఆర్ ప్రాజెక్టు పక్కన సొదయ్య గారి పొలం వద్ద ఈ వ్యక్తి మృతదేహం పడి వుంది. వారం రోజుల క్రితం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, ఎర్దనూరు గ్రామాల శివారులలో పిచ్చిపిచ్చిగా కన్నడ,హిందీ భాషల్లో మాట్లాడుతూ అతడు తిరిగేవాడని తమ విచారణలో తేలింది. ఎవరైనా ఇతడిని గుర్తించినట్లయితే వెంటనే సంగారెడ్డి రూరల్ పోలీసులకుగానీ లేదా 8712656746, 8712661831 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై మధుసూదన్‌రెడ్డి సూచించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు

గజ్వేల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలైన సంఘటన గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటి బండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుకున్న మన్విత్ వాటర్ సంప్ మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగలి అపస్మారక స్థితికి వెళ్లాడు. ఉపాధ్యాయుడు సీపీఆర్ చేసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాఠశాలలో ముగ్గురు టీచర్లు, ఆయమ్మ పిల్లలతో పనిచేయిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రైవేట్ ట్రావెల్ హెల్

మితిమీరిన వేగంతో ప్రైవేటు బస్సుల ప్రయాణం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : 65వ నంబరు జాతీయ రహదారిపై రాత్రి 9 గంటల నుంచి మొదలౌతుంది ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల వరుస. హైదరాబాద్ - ముంబాయ్ ప్రధాన రహదారి సంగారెడ్డి జిల్లా మీదుగానే వుంటుంది. జిల్లా ప్రారంభంలో లింగంపల్లి, పటాన్‌చెరు, సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి, సదాశివపేట, జహీరాబాద్ మీదుగా ముంబై వరకు ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిత్యం వందల సంఖ్యలో వెళ్తుంటాయి. ముఖ్యంగా షిర్డీకి కూడా ఎక్కువగానే బస్సులు నడుస్తుంటాయి. షిర్డీతో పాటు ముంబై నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యే బస్సులు అనేకం. రాత్రి సమయంలో బయలుదేరిన ఈ బస్సులు ఉదయానికల్లా గమ్యస్థానం చేరాలి. ఇందుకోసం బస్సు డ్రైవర్లు అతివేగంపైనే దృష్టి పెడుతుంటారు. ఈ అతివేగమే ప్రయాణికుల పాలిట శాపంగా మారుతుంది. రాత్రి సమయంలో డ్రైవర్‌కు సరైన నిద్ర లేకపోవడం, తెల్లవారుజామున మగత నిద్ర కారణంగా బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి.



జహీరాబాద్ సమీపంలో ట్రావెల్స్ బస్సు అతివేగంతో ఢీకొట్టగా దగ్ధమవుతున్న మరో వాహనం (ఫైల్)

రాత్రి బయలుదేరి.. ఉదయానికి చేరాలనే ధ్యేయం
ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం
రోడ్డు భద్రత నియమాలు గాలికి
ట్రావెల్స్ వాహనాలపై నియంత్రణేదీ?
పట్టించుకోని ఆర్టీఏ, పోలీసు అధికారులు

హైదరాబాద్, ముంబై, షిర్డీ వంటి ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో బయలుదేరి ఉదయంకల్లా గమ్యస్థానంలో ఉంచాలన్న ఒకే ఆలోచనతో వెళ్లే ట్రావెల్స్ బస్సులపై అధికారుల నియంత్రణ కరువైంది. ఇటు రవాణా శాఖ అధికారులుగానీ, అటు పోలీసులుగానీ వారిపై దృష్టి సారించడం లేదు. ఈ కారణంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురికావడమో లేక ఇతర వాహనాలను ఢీకొట్టడమో జరుగుతోంది.

ఇరుకు రోడ్డులో దూసుకెళ్తూ..

65వ నంబరు జాతీయ రహదారి అయిన లింగంపల్లి నుంచి పోతిరెడ్డిపల్లి వరకు ఆరు లేన్ల హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో రోడ్డంతా ఇరుకుగా మారింది. ఈ ఇరుకు రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అతివేగంగా దూసుకెళ్తున్నాయి. పక్కనే వెళ్తున్న ఇతర వాహనాలు, ద్విచక్ర వాహనదారులు బస్సు అతివేగం దాటికి జడిసిపోతున్నారు. చిన్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ అతివేగంగా వెళ్తుంటాయి. హైవే పక్కన ఉన్న గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో రోడ్డు మీదకు రావాలంటేనే జంకుతున్నారు. ట్రావెల్స్ అతివేగంతో ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని ఆర్టీఏ, పోలీసు అధికారులు

జిల్లా మీదుగా దూరప్రాంతాలకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల అతివేగంపై ఇటు ఆర్టీఏ అధికారులుగానీ, అటు పోలీసులుగానీ పట్టించుకోవడం లేదు. ట్రావెల్స్ అతివేగం కారణంగా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఇతర ప్రాంతాలకు చెందిన ఈ బస్సులపై జిల్లాలోని అధికారుల నియంత్రణ కరువైంది. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిన ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు వాటిని గాలికి వదిలి కేవలం ధనార్జనే ధ్యేయంగా బస్సులు నడుపుతున్నారు. జిల్లాలో తరచూ జరిగే ఘటనల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

గత ప్రమాదాలు

● ఈ ఏడాది జూన్ 27న కొల్హాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు సదాశివపేట సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై నుంచి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు.

● 2022 మే 10న హైవే 65పై సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ వాహనం కాలిపోగా, ఒకరు సజీవదహనమయ్యారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అతివేగంతో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం దెబ్బతినగా, సరుకుతో వెళ్తున్న వాహనంలో మంటలు చెలరేగాయి. ఈ మంటలకు డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఇక బస్సు డ్రైవర్‌తో పాటు 8 మంది ప్రయాణికులు తీవ్ర గాయాలయ్యాయి.

అయ్యో.. ఎంత పనాయే..!

5వ పేజీ తరువాయి.... తల్లీకుమార్తెల మృతదేహాల కోసం కర్నూలు వెళ్లారు. ఆయన ఆస్పత్రి వద్ద ఉన్నారు. విషయం తెలిసి బీఆర్ఎస్ మెదక్ మండల అధ్యక్షుడు అంజగౌడ్, నాయకులు కిష్టయ్య శివాయిపల్లిలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దురదృష్టం వెంటాడింది..

-గురుమూర్తిగౌడ్, మాజీ సర్పంచ్, సంధ్యారాణి సోదరుడు

మా చెల్లె 15 రోజుల క్రితం మస్కట్ వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకుంది. వైరల్ ఫీవర్ రావడంతో ఆగిపోయింది. బుధవారం చందనతో పాటు బెంగళూరు వెళ్తానని చెప్పింది. ఆ రోజూ ప్రయాణం వాయిదా పడింది. గురువారం రాత్రి బస్సు ఎక్కితే జరగరానిది జరిగింది. 15 రోజుల క్రితం మస్కట్‌కు, బుధవారం బెంగళూరుకు వెళ్లినా మా చెల్లెలు బతికేది. మా తల్లిదండ్రులకు ఆరుగురు సంతానంలో చిన్నది సంధ్యారాణి. కుటుంబం మొత్తం అల్లారుముద్దుగా పెంచుకున్నాం. ఒకే ప్రమాదంలో తల్లీబిడ్డా లేకుండా పోయారు.

కుమార్తె దగ్గరకు వచ్చి..

బెంగళూరుకు చెందిన ఫిలోమినా బేబీ(68), తన కుమారుడు కిశోర్‌కుమార్(41)తో కలిసి పటాన్‌చెరు కృషి కాలనీలో ఉంటున్న కుమార్తె పద్మప్రియ, అల్లుడు రాములు ఇంటికి వచ్చింది. దీపావళి పండుగ సంతోషంగా జరుపుకొన్న తర్వాత గురువారం రాత్రి బెంగళూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. ఇదే వారికి చివరి ప్రయాణం అవుతుందని భావించలేదు. తమ ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా, తల్లీ.. సోదరుడు చనిపోవడంతో కుమార్తె, అల్లుడు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందిన వెంటనే వారు కర్నూలు బయలుదేరి వెళ్లారు.

బస్సులు భద్రమేనా..!

● మెదక్ జిల్లాలో 30 కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలు

మెదక్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాలో ట్రావెల్స్ బస్సు దగ్ధమైన దుర్ఘటన నేపథ్యంలో జిల్లాలోని ట్రావెల్స్ బస్సులు పాటిస్తున్న భద్రతా ప్రమాణాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మెదక్ జిల్లాలో మొత్తం 30 కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలు ఉన్నాయి. 30 జిల్లా పర్మిట్ బస్సులను తిప్పుతున్నారు. ఈ బస్సుల్లో ప్రయాణికుల లగేజీ మినహా మండే స్వభావం ఉన్న వస్తువులేవీ బస్సుల్లో వేయకూడదు. ఇందుకు విరుద్ధంగా బ్యాటరీలు, ప్లాస్టిక్ సామగ్రి, అనేక వ్యాపార వస్తువులను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ప్రయాణికుల చిరునామాలతో కూడిన జాబితా ట్రావెల్స్ యాజమాన్యం వద్ద, బస్సులోనూ ఉండాలి. కానీ ఆ వివరాలే సేకరించడం లేదు. ప్రమాదాలు జరిగేతే బస్సులోంచి బయటపడేందుకు వీలుగా పగిలే స్వభావం ఉన్న అద్దాలను అమర్చాల్సి ఉన్నా, ఇలాంటివి ఉండడం లేదు. అదుపు చేసి ఫోమ్ సిలిండర్లు(ఫైర్ ఎక్స్‌టింగ్విషర్)లను అమర్చాల్సి ఉన్నా, ఏ బస్సులోనూ లేవు. ఏసీ బస్సుల్లో వినియోగించే సిలిండర్లలో ఫ్రియాన్ మఫ్రాన్ ఆర్22 గ్యాస్‌ను వాడాల్సి ఉంటుంది. కానీ ఎల్‌పీజీ(వంటగ్యాస్) వినియోగిస్తున్నారు. ఎల్‌పీజీ గ్యాస్‌కు మండే గుణం అధికంగా ఉండటంతో చిన్నపాటి ప్రమాదం సంభవించినా అగ్నికీలలు ఎగసిపడే ప్రమాదం ఉంది. ట్రావెల్స్ యజమానులు అడుగడుగునా నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

పెళ్లి సందడి



రామచంద్రాపురం టౌన్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి కుమారుడు అనీష్‌రెడ్డి వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన వేడుకకు ఆయనతో పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్లు దత్తాత్రేయ, విద్యాసాగర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు దామోదర్, వివేక్, పొన్నం ప్రభాకర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మెరుగైన వైద్యం అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళీఘణపూర్, అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తుంది. ఎప్పటికప్పుడు మందుల స్టాక్‌ను పరిశీలించి లేని మందులను వెంటనే పొందే విధంగా చూడాలి. ఆసుపత్రిలో అవసరం ఉన్న రోగులకు రక్త పరీక్షలు చేసేందుకు ల్యాబ్ అసిస్టెంట్ అందుబాటులో ఉండిలన్నారు. ప్రస్తుతం నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.



సర్దనలోని పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

● ఉద్యాన యూనివర్సిటీ వీసీ డా. దండ రాజిరెడ్డి

ములుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానరంగంలో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి(వీసీ) డాక్టర్ దండ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఉద్యాన పంటలు, ఉత్పత్తులు రాష్ట్రంలోని ప్రతి ఇంటికి చేరేలా త్వరలో 'ఇంటింటికి ఉద్యానం' అనే కార్యక్రమాన్ని చేపడతామని ఆయన ప్రకటించారు. వీసీగా సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగులోని వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉద్యాన రంగంలో మెరుగైన అభివృద్ధి కోసం కృత్రిమ మేధస్సు(ఏఐ)ను ఉపయోగించుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు, పరిశోధకులకు ఆధునిక హంగులతో ఇంకుబేషన్ కేంద్రాలు, స్టార్టప్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులలో పోటీ పరీక్షల నైపుణ్యం పెంచేందుకు జేఆర్ఎఫ్ కం కాంపిటీటివ్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అత్యంత లాభదాయకమైన జీనోమ్ ఎడిటింగ్, టిష్యూ కల్చర్ వంటి పరిశోధనల కోసం త్వరలోనే ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పరిశోధనలలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు దేశంలోని పేరుపొందిన పరిశోధక సంస్థలతో కలిసి పనిచేసేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్లు డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. పరిశోధనలో వచ్చే ఫలితాలు ఎప్పటికప్పుడు రైతులకు అందేలా నాణ్యమైన జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించాలని సూచించారు. ఈ సందర్భంగా వర్సిటీ సాధించిన విజయాలపై రూపొందించిన క్రానికల్ ఆఫ్ ప్రోగ్రెస్, ఆల్బమ్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ జె.చీనా, రిజిస్టర్ డాక్టర్ ఏ.భగవాన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజిరెడ్డి

కంజు పిట్టల పెంపకంతో అధిక లాభాలు

● సెర్ప్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్

మద్దూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కంజు పిట్టల పెంపకంతో రైతులు, మహిళా సంఘాలు అధిక లాభాలు పొందవచ్చని సెర్ప్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ సతీశ్ అన్నారు. మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామంలోని కంజు పిట్టల పెంపకం యూనిట్‌లో పలు జిల్లాలకు చెందిన లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంజు పిట్టల మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ఇది అత్యంత ఆరోగ్యకరమైందని, రక్తహీనత, అలర్జీ నివారణకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం డీపీఎం వాసుదేవ్ మాట్లాడుతూ కంజు పిట్టల యూనిట్ ఏర్పాటుకు మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 6 శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిట్టల పెంపకంపై మెళకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు, జగదేవ్‌పూర్, అక్కన్నపేట ఏపీఎం ప్రకాశం, నర్సయ్య, సురేందర్, సీసీ చంద్రమౌళి, మహేందర్, సాయిలు, కనకచంద్రం తదితరులు పాల్గొన్నారు.

మహాబోధి ఆలయాన్ని బౌద్ధులకే అప్పగించాలి

● మహాబోధి విముక్తి ఉద్యమం నేత భంతే వినాయచార్య

కోహీర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీహార్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మహాబోధి ఆలయాన్ని తక్షణమే బౌద్ధులకు అప్పగించాలని మహాబోధి విముక్తి ఉద్యమం నేత భంతే వినాయచార్య డిమాండ్ చేశారు. బౌద్ధులకు అత్యంత పవిత్రమైన ఈ ఆలయాన్ని తిరిగి తమకే అప్పగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు వెళ్తున్న సందర్భంగా దిగ్వాల్ గ్రామంలో పర్యటించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం దిగ్వాల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భంతే వినాయచార్య మాట్లాడుతూ మహాబోధి ఆలయం బౌద్ధుల హక్కు అని, ఈ ఆలయ విముక్తి కోసం బౌద్ధులందరినీ సంఘటితం చేసేందుకు దేశవ్యాప్తంగా పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, తలారి అశోక్, ప్రకాష్ గోర్పేటె తదితరులు పాల్గొన్నారు.

మన్యానాయక్ తండా రోడ్డుపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆరా

నాగల్‌గిద్ద, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల పరిధిలోని మన్యానాయక్ తండా రోడ్డు పరిస్థితిపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆరా తీసింది. ఆగస్టు 10న మన్యానాయక్ తండాకు చెందిన గర్భిణీ కౌసల్యబాయి పురిటి నొప్పులతో బాధపడుతుండగా, రోడ్డు సరిగా లేకపోవడం వల్ల అంబులెన్స్ గ్రామంలోకి రాలేకపోయింది. దీంతో ఆమె భర్త వాసుదేవ్ గర్భిణిని తన భుజాలపై మోసుకొని మెయిన్ రోడ్డు వరకు వచ్చి అంబులెన్స్‌లో ఎక్కించి ఆసుపత్రికి చేర్చారు. ఈ విషయం పత్రికల్లో ప్రచురితం కావడంతో నారాయణఖేడ్ మండలం మాద్వార్‌కు చెందిన గిరిజన నాయకుడు రాజునాయక్ జాతీయ ఎస్టీ కమీషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమీషన్.. తండా రోడ్డు నిర్మాణం గురించి, తీసుకున్న చర్యలు, నిధులు మంజూరు విషయాలను 30 రోజుల్లోగా తమకు తెలపాలని కలెక్టర్‌తో పాటు ఆర్ అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించింది. ఈ విషయంపై రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఈఈ రవీందర్‌ను ప్రశ్నించగా, తండా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు టెండర్ల దశలో ఉన్నాయని ఆయన తెలిపారు.

రైతుల అభివృద్ధికి డీసీసీబీ కృషి : చైర్మన్ దేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతాంగ అభివృద్ధికి డీసీసీబీ కృషి చేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో నూతన భవనంలోకి మార్చిన డీసీసీబీ బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 శాఖలు, రూ.460 కోట్ల టర్నోవర్, 105 పీఏసీఎస్‌లతో ఉన్న డీసీసీబీని ఎంతగానో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పదేళ్లలో 49 శాఖలు, రూ.2800 కోట్ల టర్నోవర్ స్థాయికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. గృహ, వాణిజ్య, వాహన, విద్యా, విదేశీ విద్యకు రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర బ్యాంకులకు మించి సీనియర్ సిటిజన్లకు, ఇతరుల డిపాజిట్లకు 0.50 శాతం అధిక వడ్డీని అందిస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ బ్రాంచ్‌లో రూ.111 కోట్ల టర్నోవర్ ఉందని, ఇందులో రూ.31కోట్ల డిపాజిట్లు, రూ.80కోట్ల రుణాలు అందించామని మేనేజర్ పురుమాండ్ల సౌభాగ్య తెలిపారు. వారితో సీఈవో ఎం.శ్రీనివాస్, ఫాక్స్ సీఈవో బాలయ్య, ఇతర నాయకులు, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

ఇంటర్వ్యూ

ఇందిరమ్మ పనులు వేగవంతం

● ఎంపీడీవో బానోతు జయరాం



అక్కన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎంపీడీవో బానోతు జయరాం పేర్కొన్నారు. లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన నిధులు నేరుగా వారి అకౌంట్‌లో జమ అవుతున్నాయని వివరించారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

ప్రశ్న: మండలానికి ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి?

● మండలానికి మొత్తం 543 ఇళ్లు వచ్చాయి. లబ్ధిదారులందరికీ ప్రొసీడింగ్‌లు అందించాం

ప్రశ్న: బేస్మెంట్ నిర్మాణంలో ఉన్న ఇళ్లు ఎన్ని?

● మండలంలో మొత్తం 405 బేస్మెంట్ నిర్మాణంలో ఉన్నాయి.

ప్రశ్న: మిగతా ఇళ్ల నిర్మాణాలు ఎప్పుడు మొదలు పెడతారు?

● మంచి రోజులు లేవని మొదలు పెట్టలేదు. ఇప్పుడు కార్తీక మాసం మంచి రోజులు వచ్చాయి కాబట్టి రెండు మూడు రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోస్తారు.

ప్రశ్న: నిర్మాణాలు పూర్తయినవి ఎన్ని?

● గోడ లెవల్‌లో ఉన్నవి 162, స్లాబ్ లెవెల్‌లో ఉన్నవి 77, మొత్తం పూర్తయినవి 3.

ప్రశ్న: లబ్ధిదారులకు డబ్బులు ఎలా అందిస్తున్నారు?

● లబ్ధిదారులకు వారి అకౌంట్‌లోనే డబ్బులు జమ అవుతున్నాయి. ఏదైనా అకౌంట్ సమస్య ఉంటే వెంటనే పరిష్కరించి డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

భౌబోయ్..

● గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారం
● స్కూలుకు వెళ్లేందుకు జంకుతున్న విద్యార్థులు
● రెండు నెలల్లో 3 పీహెచ్‌సీల పరిధిలోని దాదాపు 60మందికి పైగా కుక్కకాటు..
● వాహనాలపైకి దూసుకురావడంతో అదుపుతప్పి గాయాలబారిన పడుతున్న ద్విచక్రవాహనదారులు
● కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఇర్కోడులో రోడ్డు వీధి కుక్కల గుంపు, పెద్దలింగారెడ్డి-నారాయణరావుపేట రోడ్డు పక్కన వ్యర్థాల కోసం కుక్కల సంచారం

సిద్దిపేట రూరల్,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా గ్రామసింహాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రోడ్లపై తిరుగుతూ వాహనాలకు అడ్డంగా రావడం, వేగంగా వెళ్లే వాహనాలపైకి దూసుకురావడంతో ద్విచక్రవాహనదారులు భయాందోళనకు గురై గాయాలబారిన పడుతున్నారు. చిన్న పిల్లలను పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వృద్ధులు, చిన్నారుల పరిస్థితి సరేసరి.. రోడ్డుపై వెళ్లేందుకే జంకే పరిస్థితి నెలకొన్నది.



రాఘవాపూర్‌లో కుక్క దాడిలో గాయపడిన అరవింద్(ఫైల్)

రెండు నెలల్లో 60మందికి పైగా కుక్కకాటు..

సిద్దిపేట రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రోజురోజుకూ కుక్క కాటు బాధితులు పెరిగిపోతున్నట్లు ఆసుపత్రి సిబ్బంది పేర్కొన్నారు. ఇటీవల రాఘవాపూర్ గ్రామంలో 5వ తరగతి చదువుతున్న బాలుడు పాఠశాలకు వెళ్తున్న క్రమంలో ఓ వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గడిచిన రెండు నెలల్లో కుక్క కాటుకు గురైన 60 మందికి పైగా చికిత్స అందించగా, మరి కొందరు నేరుగా సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు.

సమస్యలను పట్టించుకునేవారేరీ?

వీధి కుక్కల సంఖ్య తగ్గించేందుకు వాటికి కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రజలు తమ సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తుండడంతో తమ సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఫిర్యాదు చేసినా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడంలేదని, ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అప్పులు చేయాల్సివస్తున్నదనే సమాధానం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్ల పక్కనే యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాలు

సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని గ్రామాల్లో చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను రోడ్ల పక్కనే విచ్చలవిడిగా పడవేయడం, కోళ్లఫారమ్ యజమానులు చనిపోయిన కోళ్లను సైతం రోడ్ల పక్కనే ఉన్న గుంతల్లో పడవేయడంతో వాటికోసం కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి సమయంలో కోళ్ల వ్యర్థాల కోసం గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారుల వెంట పడడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చికెన్ దుకాణదారులు కోళ్ల వ్యర్థాలను రోడ్ల వెంట పడవేయడంతో వాటిని తినేందుకు కుక్కలు పరస్పరం దాడి చేసుకుంటూ అదే క్రమంలో అటుగా వచ్చిన వారిని గాయపరుస్తున్నాయి. గ్రామానికి దూరంగా వేయాల్సిన కోళ్ల వ్యర్థాలను రోడ్డు పక్కనే వేయడంతో ఎంతోమంది కుక్కకాటుకు గురవుతున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రత్యేకాధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. వీధి కుక్కల బారీనుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి

వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి. గ్రామా ల్లో విచ్చలవిడిగా తిరిగే కుక్కలతో చిన్న పిల్లలు, పెద్దలు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 5వ తరగతి విద్యార్థి పై ఓ కుక్క దాడి చేసి గాయపరిచిన సంఘటనతో విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు భయపడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలన వచ్చిననాటి నుంచి మా సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వం హయాంలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పాలక వర్గం కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకాధికారుల హయాంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి.

- రాకేష్, బీఆర్ఎస్ నాయకుడు, రాఘవాపూర్

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



ఏసీపీ సదానందంకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హుస్నాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం సిద్దిపేట సురభి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరానికి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 500మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 360 మందికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏసీపీ సదానందం, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బంక చందు, ఎస్ఐ లక్ష్మారెడ్డి, చిత్తారి పద్మ, మాజీ సర్పంచ్ రమేశ్, వైద్యులు, రఫీ, దీప్తి, డ్యామ్, యోగెందర్ తదితరులున్నారు.

ప్రపంచ శాంతి పరిరక్షణలో ఐరాసది ప్రధాన పాత్ర

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డా. ఎస్ హరిబాబు మాట్లాడుతూ ప్రపంచశాంతి పరిరక్షణలో, 3వ ప్రపంచ యుద్ధం రాకుండా నివారించడంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. సహాధ్యాపకురాలు ఎస్.సుమలత మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి విద్యా సాంస్కృతిక కార్యక్రమాల్లో, పేదరిక నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భద్రతామండలిలో భారత్‌కి శాశ్వత హోదా ఇవ్వాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహేందర్ రావు, రఘుపతి, గణేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బాధ్యతలను తప్పించాలి

● టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని ప్రజ్ఞాపూర్, కొడకండ్ల, అహ్మద్‌నగర్, కోమటిబండ, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, సంగుపల్లి, సంగాపూర్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తిమ్మక్కపల్లి, కోదండరాంపల్లి, అక్కారం, శ్రీగిరిపల్లి పాఠశాలలను టీపీటీఎఫ్ సంఘం బాధ్యులు సందర్శించి, సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్ బి. రాజులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలను పెంచాలని, కామన్‌డైట్‌కు అనుగుణంగా ప్రతీ విద్యార్థికి ఇచ్చే డబ్బులు పెంచాలని కోరారు. పెండింగ్ బిల్స్, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. వారితో జోన్ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్, గజ్వేల్ మండలాధ్యక్షుడు తాళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గోక విద్యాసాగర్, నాయకులు తదితరులున్నారు.

క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

హుస్నాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న బ్లాక్ లెవెల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం ఎంఈవో బండారి మనీల బహుమతులను ప్రదానం చేశారు. ఈ క్రీడలు మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, వాజ్‌పేయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. వాజ్‌పేయి యూత్ అసోసియేషన్ సభ్యుడు బత్తుల శంకర్‌బాబు, మాజీ కౌన్సిలర్ పెరుక బాగ్యరెడ్డి, రాజేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థుల ఎంపిక

సిద్దిపేట: అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో బీచ్ వాలీబాల్ పోటీలకు అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కీర్తి ఎంపికైందని పీఈటీ నరేష్ తెలిపారు. అలాగే మిరుదొడ్డి మండలం చెప్యాల చౌరస్తాలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన అరవింద్ చదరంగం పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొగుట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 25న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పెద్దమాసాన్‌పల్లి, ఇందిరానగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతాం

● మాలమహానాడు నాయకులు

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని మాలమహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్, నీరుడి స్వామి, బైరం శివకుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మాలలకు రిజర్వేషన్ విషయంలో అన్యాయం చేశారని, మాలలతో మాట్లాడకుండా ఎస్సీ వర్గీకరణ చేసి రిజర్వేషన్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్‌లో రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కల తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను తొలగిస్తున్న గ్రామస్థులు

మద్దూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బస్సు రవాణాకు అవరోధంగా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కల తొలగింపునకు మద్దూరు మండలంలోని వంగపల్లి గ్రామశివారు ఉప్పరోనిగడ్డ గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. మాజీ ఉప సర్పంచ్ కొమిరె రాజు మాట్లాడుతూ.. గ్రామానికి జనగామ జిల్లా కేంద్రం నుంచి పోతారం మీదుగా వస్తున్న బస్సుకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు అవరోధంగా మారాయన్నారు. బస్సు సౌకర్యం కోసం గ్రామస్థులు విన్నవించడంతో ఎక్స్‌కవేటర్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టినట్లు తెలిపారు.

వే బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలి

హుస్నాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వే బ్రిడ్జి నిరుపయోగంగా మారిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, కిసాన్‌సంఘ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మార్కెట్ యార్డులోని వే బ్రిడ్జిని పరిశీలించారు. దీనిని వినియోగంలోకి తీసుకురావడంలో పాలకవర్గం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బయట వేబ్రిడ్జిల్లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడి వేబ్రిడ్జిని అందుబాటులోకి తీసుకవస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు.

రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టొద్దు



ఘనపూర్‌లో రోడ్డుకిరువైపుల ధాన్యం ఆరబెట్టిన రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవికాంత్ రావు

తొగుట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం అర బెట్టి నల్లటి కవర్లు కప్పటం వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదముందని తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు రైతులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఘనపూర్ గ్రామ శివారులో రోడ్ల కిరువైపుల ధాన్యం ఆరబెట్టిన రైతులతో ఎస్ఐ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్లపై మొక్కజొన్న, వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనదారులకు ఇబ్బంది కల్లుతుందని సూచించారు. అంతే కాకుండా ధాన్యం కుప్పలపైన నల్లటి కవర్ కప్పడం వల్లన రాత్రి వేళలో వాహనదారులకు అది కనిపించక అదుపుతప్పి కుప్పలపై పడి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పలు సందర్భాల్లో తీవ్రంగా గాయపడిన వాహనాదారులు చనిపోయిన సందర్భాలున్నాయని వివరించారు. రైతులు దాన్యాన్ని బావి వద్ద పొలంలో అరబెట్టుకోవాలని అవగాహన కల్పించారు. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలని రైతులకు సూచించారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



తొగుటలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

తొగుట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో కాన్గల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మొక్కజొన్నలకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి లబ్ధిపొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, సీఈవో గంగారెడ్డి, ఏవో మోహన్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుకేంద్రాల పరిశీలన

మద్దూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు రహీం శుక్రవారం పరిశీలించారు.

ముంచిన సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలు



దూళిమిట్ట మండలంలో మొలకెత్తని మొక్కజొన్న విత్తనాలు

మద్దూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించిన మొక్కజొన్న విత్తనాలు రైతుల్ని నట్టేట ముంచాయి. దూళిమిట్ట మండలానికి సబ్సిడీపై నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన 2 క్వింటాళ్ల మొక్కజొన్న ప్యాకెట్లు వచ్చాయి. ఒక్కో ప్యాకెట్‌లో గల 4 కిలోల విత్తనాలకు రూ.1380లు కాగా రూ.700ల సబ్సిడీపై 50 ప్యాకెట్లను ఏవో రైతులకు అందించారు. సబ్సిడీపై వచ్చిన మొక్కజొన్న విత్తనాలను యాసంగిలో సాగు చేసిన రైతులకు 10 రోజులు దాటినా విత్తనాలు మొలకెత్తలేదని తెలుస్తోంది. భూమి చదును చేసి ఎకరాకు రెండు ప్యాకెట్ల చొప్పున విత్తనాలు నాటినా మొలకెత్తకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి జెర్మినేషన్ ప్రక్రియలో సమస్యలు వచ్చాయని విత్తన ప్యాకెట్లు తీసుకున్న రైతుల నుంచి వాపసు తీసుకోనున్నట్లు ఏవో అక్రోజ్ తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలి

పంట బాగా వస్తుందని వ్యవసాయశాఖాధికారులు చెబితే రెండు ప్యాకెట్ల విత్తనాలు తీసుకున్నా. నాటి పది రోజులు దాటినా 10 శాతం మొలకెత్తలేదు. ఎకరానికి 15 వేల ఖర్చు వచ్చింది. నమ్మి సీడ్ తీసుకుని వేస్తే నట్టేట ముంచారు. నష్ట పరిహారం ఇవ్వాలి.

-చింతల రాజు, బైరాన్‌పల్లి గ్రామ రైతు

పొన్నాల ప్రభుత్వ పాఠశాలకు రూ.1.25 లక్షల సామగ్రి వితరణ

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నాల ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలకు గ్రామంలోని ఐడీబీఐ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో సీఆర్ఎస్ నిధుల కింద లక్షా 25 వేల విలువగల డిజిటల్ సామగ్రిని శుక్రవారం అందించారు. 55 ఇంచుల ఎల్ఈడీ టీవీ, వాటర్ ప్యూరిఫైయర్, 2 బీరువాలు పాఠశాలకు విరాళంగా అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్ని శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామానికి చెందిన స్థానిక నాయకులు దార బోయిన సంపత్ యాదవ్, శ్రీనివాస్ కలిసి రూ. 50 వేల విలువచేసే స్పోర్ట్స్ డ్రెస్సులను విద్యార్థులకు ఉచితంగా అందించారు. అనంతరం పాఠశాల తరపున దాతలను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ పణి రాజు, షామీర్ పేట బ్యాంక్ మేనేజర్ అజిత్ కుమార్, తడకపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ వితరణ

మర్కుక్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలో ఏడేళ్లుగా మూతపడిన గంగాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వెంకటరాములు చొరవతో ఈ సంవత్సరం పునఃప్రారంభించారు. ఈ మేరకు గ్రామంలోని ప్రజలు తమ పిల్లలను సర్కారుబడిలోనే చదివిస్తామని ఏకగ్రీవంగా తీర్మానించి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో మొత్తం 20 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరగా ఎర్రవల్లి యువ నాయకుడు నారన్నగారి రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక్కో విద్యార్థికి రెండు జతల స్పోర్ట్స్ యూనిఫాం అందజేసి ఉదారతను చాటుకున్నాడని ఎంఈవో వెంకటరాములు తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం ఇసుకకు అనుమతి ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దయానంద్‌రెడ్డి

జగదేవ్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుకకు అధికారులు అనుమతి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నిర్మలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిగుల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువస్తుండగా పోలీసులు అడ్డుకొని సీజ్ చేయడంపై వారు మండిపడ్డారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను వెంటనే విడుదల చేయాలని, ఇందిరమ్మ లబ్దిదారులకు ఇసుక సరఫరాకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రిటైర్మెంట్ పెండింగ్ బకాయిలను చెల్లించాలి

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పొన్నమల్ల రాములు, కార్యదర్శి సలీం మాట్లాడుతూ రిటైర్మెంట్ అయి 18 నెలలు గడిచినా ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడం వలన అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయడంలో అధికారుల నిర్లక్ష్యం

సిద్దిపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీజేపీ నాయకులు మొగుళ్ల మల్లేశం, దేవరాజులు మండిపడ్డారు. శుక్రవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మార్క్‌ఫెడ్ అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ స్థానికంగా పీఏసీఎస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



కావేరి యూనివర్సిటీలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల ఇన్నోవేషన్స్ పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ

విజ్ఞాన వినియోగంతో వ్యవసాయాభివృద్ధి

(5వ పేజీ తరువాయి)




గవర్నర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హైమావతి

హాని జరగకుండా సహజ సిద్ధంగా లభించే సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరిగి, ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు సాధించాలని వివరించారు. అనంతరం కావేరి యూనివర్సిటీ, సీడ్స్ కంపెనీలో సాధించిన పురోగతి, క్షేత్ర స్థాయి పరిశోధనలు, అధునాతన వసతులు, ఎంటమాలజీ, పాథాలజీ, సాయిల్ సైన్స్, బ్రీడింగ్, ఫిజియాలజీ ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల డ్రోన్ టెక్నాలజీ, రోబో టెక్నాలజీ, త్రీడీ ప్రింటింగ్, ఏఆర్ అండ్ వీఆర్ మోడల్స్ అగ్రికల్చరల్ ఇన్నోవేషన్స్‌ను తిలకించారు. అనంతరం నూతనంగా ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్‌లో టిష్యూ కల్చర్, జినోమిక్స్, స్పీడ్ బ్రీడింగ్, ప్లాంట్ హెల్త్ ల్యాబ్స్, జీన్ బ్యాంక్‌ను సందర్శించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రవీణ్ రావు, గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ రఘువీరారెడ్డి, కావేరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష పొలసాని, అగ్రికల్చరల్ డీన్ ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)



గాజులపల్లిలో కూలీకి ఈ-కేవైసీ చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు

ఫోన్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి ఈ రెండు ఫొటోల్లో ఉంటేనే కూలి అందుతుంది.

త్వరగా పూర్తయ్యేలా చర్యలు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ వివరాలను ఈ-కేవైసీ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా నమోదు పూర్తి చేయించేలా అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించాం. దౌల్తాబాద్ మండలంలో మొత్తం 10,400 మంది కూలీలు ఉండగా, ఇప్పటివరకు 7,400 మంది కూలీలకు ఈ-కేవైసీ పూర్తయింది. ఈ-కేవైసీ రాని కూలీలు ఆధార్ అప్‌డేట్ చేయించుకున్న తర్వాత మళ్లీ ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అడిగిన వారిలో అర్హులైన వారందరికీ ఉపాధి కల్పిస్తాం.

- రాజు, ఏపీవో, దౌల్తాబాద్